క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన సుంకులాపరమేశ్వరి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉగాది, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకొని హుండీ ఆదాయం రూ.1,92,350 ఆదాయం వచ్చిందని, ఈ సొమ్మును దేవస్థానం బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశామని చెప్పారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చుమ్మా నాగన్న, మురళీ, ప్రసాద్, పుల్లయ్య, సురేష్, మనోజ్ పాల్గొన్నారు.

పరీక్ష తేదీ మార్పు

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష తేది మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 20న నిర్వహించాల్సిన పరీక్షను ఈస్టర్ పండుగ ఉండడంతో మరుసటి 21వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు.

కంప్యూటరైజేషన్ పూర్తి

శిరివెళ్ల: వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరైషన్ పూర్తయిందని కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుక గురువారం తెలిపారు. సహకార సంఘాల పనితీరు పారదర్శకంగా ఉండేందుకు లావాదేవీలను కంప్యూటర్‌లో పొందు పరిచామన్నారు. ఏడాది పాటు ప్రక్రియ జరిగిందని, బ్రాంచి పరిధిలోని 7 సంఘాలలో ఇక నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయని తెలిపారు. 10 శాతం వడ్డీతో రూ.20 లక్షల వరకు బంగారంపై రుణాలు ఇస్తున్నామన్నారు. బ్రాంచి పరిధిలో రూ.100 కోట్ల రుణాలు పంపిణీ చేయగా రూ.80 కోట్ల మేరకు వసూళ్లయ్యాయన్నారు. రూ.91 లక్షలు మొండి బకాయిలున్నాయన్నారు.

నేడు విపత్తుపై సమీక్షా సమావేశం

ఉయ్యాలవాడ: ప్రకృతి విపత్తులపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు అన్ని శాఖలల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

26న సుందరమ్మ భూముల కౌలుకు వేలం

నంద్యాల(అర్బన్): మండల పరిషత్ స్వాధీనంలో ఉన్న సింగంశెట్టి సుందరమ్మ భూముల కౌలుకు ఈనెల 26వ తేదీన స్థానిక కార్యాలయంలో ఎంపీపీ ప్రభాకర్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్.1544/1 తడి 5.02, 112/ఏ మెట్ట 7.14 మొత్తం 16.58 ఎకరాలకు సంబంధించి కౌలు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో చైర్మన్ శివయ్య, సెక్రటరీ అబ్దుల్‌కలాం, నగరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గురువారం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలో పని చేసిన ఓపీఎస్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ అమౌంట్ మంజూరు చేయాలని కోరారు. పీఎఫ్ అమౌంట్ ఉపాధ్యాయులకు చెక్కు ద్వారా లేక పీఎఫ్ అకౌంట్‌కు బదిలీ చేసి పరిష్కరించాలని, 2022 నుంచి మున్సిపల్ పరిధిలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలను చెక్కు రూపంలో ఇవ్వాలని కోరారు. వరప్రసాద్, మౌలాలి, సాంబశివుడు, అరవిందకుమార్, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముతవల్లుల సస్పెన్షన్



చౌక్ మసీదును సందర్శించిన మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహాపర్వీన్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని చౌక్ మసీదు, బాలాజీ కాంప్లెక్స్‌లోని లతీఫియా మసీదుల ముతవల్లులను సస్పెండ్ చేసినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహాపర్వీన్ తెలిపారు. జిల్లా ఇన్‌స్పెక్టర్లు ఇమ్రాన్, మురాద్ అన్సారీ, అల్తాఫ్ హుసేన్‌లతో కలిసి ఆమె గురువారం చౌక్ మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా సబిహా పర్వీన్ మాట్లాడుతూ మసీదుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఉత్తర్వుల మేరకు ఆయా మసీదులను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నామని చెప్పారు.

ఆధార్..బేజార్!





తలుపులు తెరుచుకోని హరినగరం పంచాయతీ భవనం, మండలూరులో ఖాళీగా ఉన్న ఆధార్ కేంద్రం గది

● ఇష్టానుసారంగా క్యాంప్‌ల నిర్వహణ

రుద్రవరం: మండలంలో ఆధార్ క్యాంప్‌ల నిర్వాహణ ఇష్టానుసారంగా మారింది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం క్యాంప్‌లు విజయవంతం చేయాల్సిన డిజిటల్ అసిస్టెంట్లు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మండలంలో డిజిటల్ అసిస్టెంట్ల ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. 6 ఏళ్ల లోపు వయస్సున్న చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేస్తోంది. అందులోభాగంగా మండల పరిషత్ అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఆయా తేదీల్లో నిర్ణయించిన గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని డిజిటల్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు. ఈనెల 8, 9, 10, 11 తేదీల వారీగా క్యాంప్‌లు నిర్వహించాల్సిన గ్రామాలు, తేదీలు పాల్గొనే డిజిటల్ అసిస్టెంట్ల పేర్లతో జాబితా రూపొందించారు. గురువారం హరినగరం గ్రామ పంచాయతీ భవనంలో సుదీర్ అనే డిజిటల్ అసిస్టెంట్ ఆధార్ క్యాంప్ నిర్వహించాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం 2 గంటలు దాటినా పంచాయతీ భవనం తలుపులు తెరుచుకోలేదు. అక్కడ ఎలాంటి ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేయలేదని సర్పంచు కమలమ్మ, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి పాములేటి తెలిపారు. మండలూరు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ మహేంద్రనాయక్ ఆధార్ క్యాంప్ కొనసాగించాల్సి ఉంది. అక్కడ కూడా మధ్యాహ్నం 2.30 గంటలు దాటినా ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేయలేదు. ఇదేమిటని అక్కడి సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించగా డిజిటల్ అసిస్టెంట్ వచ్చి వెళ్లిపోయాడని తెలిపారు. ఆధార్ క్యాంప్‌ల నిర్వాహణ నిర్లక్ష్యంపై ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



తలుపులు తెరుచుకోని సచివాలయం

తాళం లేక సచివాలయ ఉద్యోగుల నిరీక్షణ

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామ సచివాలయం తలుపులు గురువారం ఉదయం 11.30 గంటలైనా తెరుచుకోలేదు. వివిధ గ్రామాలు, పట్టణాల్లో నివాముంటున్న ఉద్యోగులు నిర్ణీత సమయానికి సచివాలయానికి చేరుకున్నారు. కాగా స్వీపర్ హనుమంతు తాళాలు ఇంట్లో పెట్టి ఉపాధి పనులకు వెళ్లాడు. ఎంతకూ అతడు రాకపోవడంతో ఉద్యోగులు వాహనాల పార్కింగ్ షెడ్డులో వేచి చూడాల్సి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి కొండయ్య వచ్చి మరో తాళం చెవి తెప్పించి తెరిపించడంతో ఉద్యోగులు లోపలకు వెళ్లారు.



షెడ్డులో వేచిచూస్తున్న సచివాలయ ఉద్యోగులు

డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం



సీపీఆర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం లారీ, ఆటో, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఓమిని హాస్పిటల్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే, పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో పట్టణంలోని సుమారు 250 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేశారు. జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అత్యాశకు వెళ్లి ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. శిబిరానికి వచ్చిన డ్రైవర్లకు ప్రమాదం జరిగి షాక్‌కు గురైన వ్యక్తులకు సీపీఆర్ ఎలా చేయాలో డాక్టర్లు డెమో ద్వారా అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా, ఓమ్ని హాస్పిటల్, పుష్పగిరి హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గోస్పాడు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఒంటివెలగల గ్రామంలో గురువారం పౌష్టికాహారం పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భం దాల్చిన సమయం నుంచి కాన్పు అయ్యే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లు, పాఠశాలల తనిఖీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయప్రతాపరెడ్డి

నంద్యాల(అర్బన్): ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు నంద్యాల జిల్లాలో స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డి ఆకస్మిక తనిఖీలతో అధికారులను, సిబ్బందిని హడలెత్తించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఎవరిపై సస్పెన్షన్ వేటు పడకపోవడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. 9న బనగానపల్లె పట్టణంలోని కస్తూర్బా బాలికల ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలలో వంటశాలను తనిఖీ చేసి మెరూ పరిశీలించారు. అలాగే అక్కడ ఎస్సీ బాలికల వసతి గృహం, బీసీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేసి కూరగాయలు, బియ్యం, కందిపప్పు, తదితర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. గురువారం బనగానపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. హాస్టల్‌లో జరుగుతున్న అభివృద్ధి, మరమ్మతు పనుల గురించి ఆరా తీశారు. అలాగే నంద్యాలకు చేరుకొని ముందుగా జిల్లాకలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం క్రాంతినగర్‌లోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. దేవనగర్‌లోనున్న ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి భోజన నాణ్యతను పరిశీలించి మెనూ పాటిస్తున్నారా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా సెల్: 9490551117 నంబరుకు వాట్సాప్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఇన్‌చార్జి డీఎస్‌ఓ రాజునాయక్, ఏఎస్‌ఓ రవిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాతో యువతకు ఉపాధి అవకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం పట్టణంలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి ప్రారంభించారు. అరబిందో ఫార్మసీ, అపోలో ఫార్మసీ,అమెజాన్, ఆల్‌డిక్సన్ టెక్నాలజీస్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్, నవత ట్రాన్స్‌పోర్ట్, పేటీఎం, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్, మాళవిక డెవలపర్స్, ఫాక్స్‌కాన్, ఈ ప్యాక్ టెక్నాలజీస్, ఫ్యూచర్ ప్రాపర్టీ సొల్యూషన్స్ కంపెనీ యాజమాన్యాలతో పాటు డీఎస్‌డీఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సోమశివారెడ్డి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జేకేసీ కో–ఆర్డినేటర్ పార్వతి, ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

నంద్యాల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సహకార అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సహకార సమన్వయ అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, నాబార్డ్ డీడీఏ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా, మత్స్యశాఖ అధికారి రాఘవరెడ్డి, పశుసంవర్ధక అధికారి గోవింద్‌నాయక్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు గాను 51 సంఘాల్లో కంప్యూటీకరణ పూర్తయ్యిందని, రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు సహకార అధికారులు, కో–ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు సహకరించాలని కోరారు. మిగిలిన ఐదు పరపతి సంఘాలు వారం రోజుల్లో కంప్యూటీకరణ పూర్తి చేసి స్వాధీనం చేయాలని సూచించారు. ఆరు పరపతి సంఘాలకు సంబంధించిన గోడౌన్లను వరల్డ్ లార్జెస్ట్ గ్రెన్ స్టోరేజ్ యూనిట్‌గా మార్పు చేసేందుకు కమిటీ సభ్యులు అంగీకరించారన్నారు. ఇకనుంచి సంఘాలలో మాన్యువల్‌గా కాకుండా ఆన్‌లైన్‌లో ద్వారా లావాదేవీలు జరగాలని కలెక్టర్ సూచించారు. పరపతి సంఘాల ద్వారా డ్రోన్‌ల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయాలని చెప్పారు.

గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి




గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పెంచిన వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని సంజీవనగర్ సెంటర్‌లో ఉన్న పెట్రోల్ బంక్ ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ వంట గ్యాస్ ధరపై రూ.50, డీజిల్, పెట్రోల్‌పైన రూ.2 చొప్పున పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో ధరలను పెంచడం దుర్మార్గమన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, హరినాథ్, సుశీలమ్మ, శ్రీనివాసులు, భూమిని శ్రీనివాసులు, సంజీవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో పోలీసుల సోదాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి బొగ్గరపు నాగరాజుపై చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు నేపథ్యంలో త్రీటౌన్ పోలీసులు ఆయన ఇల్లు, వ్యాపార సంస్థల్లో గురువారం సోదాలు నిర్వహించారు. త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన బొగ్గరపు నాగరాజు బెంగళూరుకు చెందిన మను అనే వ్యక్తితో వ్యాపారలావాదేవీలు కొనసాగించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో వ్యాపారంగా విడిపోయారు. అయితే మను సంతకాన్ని ఫోర్జరీ చేసి కోట్ల రూపాయలు అప్పుగా ఉన్నట్లు తప్పుడు అగ్రిమెంట్లు సృష్టించి కోర్టులో పిటిషన్ వేశారు. ఈ క్రమంలో నాగరాజు తప్పుడు సంతకాలతో తనను మోసం చేశాడని మను ఫిర్యాదు చేశాడు . ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆయనకు సంబంధించిన వ్యాపార సంస్థలతో పాటు, ఇంట్లో సోదాలు నిర్వహించి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.


కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డ్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు చెన్నయ్య డిమాండ్ చేశారు. గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవికి అందజేశారు. వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు, సెక్యూరిటీ గార్డ్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఎంఓయూ ప్రకారం వేతనం ఇవ్వాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ స్లిప్‌లు ఇవ్వాలన్నారు. కార్మికులకు బ్లౌజ్‌లు, ఫినాయిల్, సబ్బులు, కొబ్బరి నూనె నెలనెలా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు జ్యోతి, అంజలి, శిరీష, ఉమాదేవి పాల్గొన్నారు.

తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కోటేష్ పెయింటింగ్



కోటేష్ వేసిన చిత్రం

నంద్యాల(అర్బన్): నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చిత్రం గ్యాలరీ ప్రదర్శనకు ఎంపికైంది. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టార్చ్, కళాయజ్ఞం సంస్థలతో శిలానిశ్శబ్దం పేరిట కాకతీయుల శిల్పకళా వైభవం గురించి కాకతీయ కట్టడాలపై పెయింటింగ్స్ వేయాలంటూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60మంది చిత్రకారులను ఎన్నుకున్నారు. అందులో కోటేష్ వేసిన చిత్రం గ్యాలరీ చిత్రప్రదర్శనకు ఎంపికైంది. ఈ మేరకు ఈనెల 12, 13, 14తేదీల్లో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనలో చిత్రాన్ని ఉంచనున్నట్లు కోటేష్ తెలిపారు. కాకతీయ పాలకులు ఘనమైన పాలన అందించారని, నాటి కట్టడాలు, శిథిలమైన శిల్పాలు, ఆలయాలు ఇలా చిత్రాల ద్వారా లోకానికి తెలియజేయాలని ప్రదర్శనను ఏర్పాటు చేశారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన వీరబ్రహ్మయ్య

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లాకు చెందిన తెన్నేటి వీరబ్రహ్మయ్య (65) మృతి చెందాడు. మైదుకూరు – బద్వేలు రహదారిలోని గోపిరెడ్డిపల్లె వద్ద సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బద్వేలు వైపు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన వీరబ్రహ్మయ్య గ్రామంలోనే పురోహితుడుగా పనిచేస్తున్నాడు. ప్రొద్దుటూరులో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన అక్కడ నుంచి స్వయంగా కారు నడుపుకుంటూ బద్వేలుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది కారులో ఇరుక్కుపోయిన వీరబ్రహ్మయ్య మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మల్లేశ్వరమ్మ, వివాహితులైన ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ముగిసిన వేలంపాటలు



వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలోని ఖాళీస్థలాల్లో షాపులు నిర్వహించుకునేందుకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలాలు నిర్వహించారు. పాదరక్షలు భద్రపరుచుకు హక్కులను మహానందికి చెందిన సురసుర వెంకటరమణ రూ.10,65,000కు దక్కించుకున్నారు. కాగా గత ఏడాది రూ.16,03,000 రాగా ఈ ఏడాది రూ.5.38 లక్షల నష్టం వాటిల్లింది. ఖాళీ స్థలాల్లో ఒక్కో షాపుకు నెలకు రూ.2,700 చొప్పున 24 షాపులకు నెలకు రూ. 64,800 ప్రకారం పాతవారికే కట్టబెట్టినట్లు అధికారులు తెలిపారు. వీటితోపాటు రెండు పొలాలకు వేలాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, పి.సుబ్బారెడ్డి, సెక్షన్ ఇన్‌చార్జ్ మల్లికార్జునయ్య పాల్గొన్నారు.


జగనన్న కాలనీల్లో సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించి, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇంటి పన్నుల పెంపు ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణ వాసులకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంత వాసులకు 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇంటి పన్నులు పెంచనని చెప్పి ప్రజలపై 15శాతం పెంచారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, నాగరాజు, ఏసురత్నం పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ యుగంధర్

ఆళ్లగడ్డ: రోడ్డు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ యుగంధర్ వాహనదారులకు సూచించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి పాతబస్టాండు మీదుగా ఆచారికాలనీ వరకు ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ క్రైమ్‌పై ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా తోపుడుబండ్లు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుందన్నారు. నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తటస్థపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నగీన ఉన్నారు

సామూహిక వివాహాలు



సామూహిక వివాహాల్లో పాల్గొన్న వరులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో 12 పేద ముస్లిం జంటలకు గురువారం అంజుమన్ షాదీఖానాలో ఉచిత సామూహిక వివాహాలు అంజుమన్ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్‌కుద్దూర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా వివాహాలు జరిపిస్తామని, ఈ ఏడాది 12 జంటలు ముందుకు రావడంతో ఒక్కొక్కరికి రూ.50వేల విలువైన చెక్కులను అందించామన్నారు. అలాగే అంజుమన్ ద్వారా 300 మంది విద్యార్థులకు రూ.3వేలు చొప్పున ఆర్థిక సహకారం అందించామని చెప్పారు. అంజాద్‌బాషా సిద్దిఖీ, షేక్ అబ్దుల్‌సమ్మద్, అబ్దుల్‌హక్, మహమ్మద్‌గౌస్, ఇదాయతుల్లా పాల్గొన్నారు.

నేడు విగ్రహప్రతిష్ట

దొర్నిపాడు: మండల శివారులోని కేసీ కెనాల్ సమీపంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం అక్కడే వల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రాణప్రతిష్ట, పూర్ణాహుతి, జ్వాలా దర్శనం, మహా మంగళహారతి ఉంటుందన్నారు.

డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారాలకు వినియోగించొద్దు



సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

నంద్యాల(అర్బన్): గృహ అవసరాలకు వినియోగించాల్సిన డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని పలు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీలక్ష్మీశ్రీనివాస, గ్రాండ్ ఫాస్ట్‌ఫుడ్, జావిద్ హోటల్, గోల్డెన్ ఫుడ్‌ప్లాజా తదితర హోటళ్లలో ఏసీటీఓ వెంకటరమణ, సీఎస్‌డీటీ ప్రసాదరావుతో కలిసి దాడులు నిర్వహించి 5 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందు పట్టణంలోని మూడు రేషన్ డీలర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి 1382099 షాపులో 46 చక్కెర ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు రేషన్ షాపు డీలర్ నాగప్రసాద్, సిలిండర్లతో పట్టుబడిన హోటళ్ల యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు.

త్వరలోనే వసతి గృహాల నిర్మాణ పనులు

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించనున్న 50 వసతి గృహాల నిర్మాణాలను త్వరలో మొదలుపెడతామని దేవదాయశాఖ డీఈ ఎం.శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గురువారం మహానందికి వచ్చిన ఆయన ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ రూ.10.50 కోట్లతో నిర్మించనున్న వసతిగృహాల పనులకు వారం రోజుల్లో మార్కింగ్ వేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.